# అనుమానం-పెనుభూతం

- పులిపాక తాజుద్దీన్


గంభీరంగా నా ఆఫీసు రూములోకి ప్రవేశించాను. ఠీవిగా నా రివాల్వింగ్ ఛెయిర్లో కూచున్నాను. దర్జాగా సిగరెట్టు వెలిగించి అందరి డిటెక్టివ్‌ల్లాగే నేనూ తీక్ష ణంగా ఆలోచించసాగాను. కారణం నెల రోజుల కిందట ఈ డిటెక్టివ్ ఏజెన్సీ ప్రారంభించాను. కొత్తల్లో నేను ఆఫీసుకు రాగానే సవినయంగా లేచి గుడ్‌మార్నింగ్ చెప్పే నా అసి స్టెంట్ గత పదిరోజులుగా ఆ పని చేయడం మానుకున్నాడు. ఇది కించిత్ బాధాకరమైన విషయమే అయినా, దానికి కారణాలు లేకపోలేదు. గత నెలరోజులుగా మా ఆఫీ సుకు ఓ కేసుగానీ, ఓ క్లయింటుగానీ వచ్చిన పాపాన పోలేదు. బుర్రకి షార్పునెస్ తగ్గిపోతుందేమో అని భయంగా ఉంది. నా అసిస్టెంట్ కిష్టి వైపు తిరిగి ''నాకోసం ఎవరైనా వచ్చారా?'' అన్నాను ఠీవిగా.

''ఓ క్లయింటు వచ్చాడు బాస్'' అన్నాడు వాడు ఉత్సాహంగా. నాలో ఆశ్చర్యానంద ఉద్వే గాలు ముప్పిరిగొన్నాయి. గంభీరత చెడకుండా ''వివరాలు సేకరించావా?'' అన్నాను.

''సేకరించాను బాస్'' అని గొంతు సవరించుకుని ''అతని పేరు గౌతమరావు బాస్. మదనపల్లిలో ఏదో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లై రెండేళ్లయ్యింది. పిల్లల్లేరు. భార్యాభర్తలు అన్యోన్యంగానే ఉంటు న్నారు. అలాటి పరిస్థితుల్లో అతనొక చిత్రమైన సమస్యలో పడ్డాడు'' అన్నాడు. నేను సిగరెట్ దమ్ము గట్టిగా లాగి ''ప్రొసీడ్'' అన్నాను.

''తన భార్యకో ప్రియుడున్నాడట బాస్. కానీ అతని భార్య ప్రవర్తన చూస్తే అలా అనిపించదట. చాలా ఆద ర్శవంతమైన భార్యలా ఉంటుం దట''

''మరి ఆమెకో ప్రియుడున్నాడని



అనుమానం దేనికి?''

''అదేమాట నేనూ అడిగాను బాస్. ఈ మధ్య ఇంట్లో ఉన్న  ఏదో నవల చదువుదామని తీస్తే అందులోంచి ఓ అందమైన యువకుడి ఫోటో బయటపడిందిట బాస్. ఆ ఫోటో వెనుక భాగమంతా ఆ ప్రియుడు 'ఐలవ్యూ, ఐలవ్యూ' అనే వాక్యాలతోనే నింపేసి ఆమెకు ప్రెజంట్ చేసాడట బాస్''

''ఆ ఫోటో అతని భార్యే ఉంచిందని ఎలా తెలుసు?''

''ఆ ఇంట్లో ఉండేది అతనూ అతని భార్యేనట బాస్''

''అతను తన భార్యను నిలదీయలేదా?''

''అంతపనీ చేసాట్ట బాస్. కానీ ఆమె హృదయ విదారకంగా ఏడిచి తనకి ఆ ఫోటోకి ఎటువంటి సంబంధం లేదని మొరపెట్టుకుందట బాస్''

''అయితే మనని ఏం చేయమంటాడు?''

''ఆ ఫోటో వాళ్లింటికి ఎలా వచ్చిందో, అసలు ఆ ఫోటోలో వ్యక్తికీ వాళ్ల ఆవిడకి సంబంధం ఉందో లేదో?'' ఉంటే ఏ బాపతు సంబంధమో తెలుసుకోవాలట బాస్. ముఖ్యంగా ఆ ఫోటోలోని వ్యక్తిని కలుసుకోవాలని చాలా ఆసక్తిగా ఉందతనికి'' అంటూ ముగించాడు కిష్టి.

''ఐసీ... ఫీజు సంగతి చెప్పావా?''

''చెప్పాను బాస్. ఐదువేలు ఫీజు అవుతుందనీ, రెండువేలు అడ్వాన్సుగా ఇవ్వాలనీ, ఇవి కాక ఖర్చులకు మరో ఐదువందలవుతుందని చెప్పాను.''

''వెరీ గుడ్, ఏమన్నాడు?''

''వెయ్యి రూపాయలు ఎడ్వాన్సు ఇచ్చాడు. రేపు మరిన్ని వివరాలు మరో వెయ్యి రూపాయలు పంపుతానన్నాడు. ఎల్లుండి శెలవుపెట్టి మిమ్మల్ని కలుస్తానన్నాడు.

''ఫైన్... ఫైలు తయారుచేసావా?''

''లేదు బాస్. మరికొన్ని వివరాలు పంపుతానన్నాడుగా. వివరాలన్నీ సేకరించిన తర్వాత ఫైలు తయారుచేయొచ్చులే అని ఊరుకున్నాను''

''అయితే ఇంతవరకూ ఈ కేసు విషయంలో నువ్వేమీ చేయలేదా?''

''ఎందుకు చెయ్యలేదు బాస్. అతనిచ్చిన వెయ్యి రూపాయల ఎడ్వాన్సు నా జీతం కింద ఉంచేసుకున్నాను బాస్''

''గుడ్'' అన్నాను ఏమనాలో తెలియక, లోపల్నుంచి వస్తున్న దుఃఖాన్ని, కోపాన్ని అణుచుకుంటూ.


***

ఆ మరునాడు గౌతమరావు దగ్గర్నుంచి వివరాలేవీ రాలేదు. గౌతమరావూ శెలవుపెట్టిరాలేదు. చేయడానికి పనేమీ లేదు. ఇంతలో పోస్టుమానొచ్చి ఓ పొడవాటి ఇన్స్యూర్డ్ కవరిచ్చి వెళ్లిపోయాడు. అందులోంచి పది వందరూపాయల నోట్లు, ఓ ఉత్తరం బయటపడ్డాయి. డబ్బుని జేబులో పెట్టుకుని ఉత్తరం కిష్టిగాడికిచ్చి చదవమన్నాను. కిష్టిగాడు చదవనారంభించాడు.

మహారాజశ్రీ రాజేశ్వరరావుగారికి! నమస్కారములు. నేను మీ ఆఫీసుకు వచ్చినప్పుడు మీరు ఆఫీసులో లేరు. మీ అసిస్టెంటుగారికి నా వివరాలు, సమస్యలు అన్నీ వివరంగా చెప్పాను.

వారికి వెయ్యి రూపాయలు ఎడ్వాన్సు కూడా ఇచ్చాను. మరో వెయ్యి ఉత్తరంతో పాటు పంపుతున్నను. నా భార్య గుణం ఎటువంటిదైనా నేను ఇప్పుడు చేసేదేమీ లేదు. కానీ ఆమె ప్రియుడి జాడ నాకు తెలియాలి. అతని ఫోటో ఇందులో పంపుతున్నాను. అతనికి తనివితీరా దేహశుద్ధి చేస్తే కానీ నాకు మనశ్శాంతి లేదు. మీరు చురుగ్గా దర్యాప్తు చేసి అతని జాడ కనుగొనగలరు.

భవదీయుడు
గౌతమరావు.



''అర్ధరాత్రి ఒక ఇంట్లో దూరి దొంగతనం చేసినందుకు గాను నీకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తున్నాను'' తీర్పు చెప్పాడు జడ్జి.

''ఇది చాలా అన్యాయం యువరానర్, గతంలో పగటిపూట దొంగతనం చేసానని జైలు శిక్షవేశారు. ఇప్పుడేమో రాత్రీపూట దొంగతనం చేసానని శిక్షవేస్తున్నారు. పగలూరాత్రీ పనిలేకుండా నన్నెలా బతకమంటారో మీరే చెప్పండి'' అన్నాడు దొంగ.

అని ముగించాడు కిష్టి. నేను కవరును బాగా చించి లోపలున్న మరో చిన్న కవరును బయటకు తీసాను. ఆ కవరులోంచి గౌతమరావు పెళ్లాం ప్రియుడు ఫోటో బయటకు తీసాను. ఆ ఫోటో చూడగానే నా గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. రక్తప్రసరణ స్తంభించిపోయింది. కళ్లు తిరిగి, కాళ్లు తేలిపోతున్నాయి. ఆ ఫోటోలో వున్నది ఎవరో కాదు... నేనే.

''అదేమిటి బాస్, అలా అయిపోతున్నారు'' అంటూ కిష్టి పరిగెత్తుకొచ్చి గ్లాసెడు నీళ్లు నా మొహం మీద జల్లాడు. రెండు కాఫీలు పంపమని వీధి చివరనున్న హోటలుకు ఫోను చేసాడు. డాక్టరును పిలిచే ప్రయత్నంలో ఉండగా ''కిష్టీ!'' అన్నాను నీరసంగా.

''య్యస్ బాస్''

''అయమాల్రెట్ కంగారు పడకు''

''అలాగే బాస్. ఎందుకు బాస్ అంత షాక్ తిన్నారు.''

''తాపీగా చెబుతా, నన్ను కాస్త తేరుకోని''

''అయితే కాఫీలు రానీయండి బాస్'' అన్నాడు కిష్టి. ఇంతలో కాఫీలొచ్చాయి. కాఫీ తాగిన తర్వాత కాస్త స్థిమిత పడ్డాను. కిష్టి కవర్లో వచ్చిన నా ఫోటోను తీక్షణంగా చూస్తూ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. నాకు వాడి మొహం చూడడానికే సిగ్గేస్తోంది. వాడు తలెత్తి నావైపు అదోలా చూసాడు.

''నన్ను నమ్ము కిష్టీ! నేను ఏ పాపం ఎరుగను''

''ఈ ఫోటోలో ఉన్నది మీరేనా?''

''అక్షరాలా నేనే''

''ఈ ఫోటో ఎవరికైనా పంపించారా?''

''లేదు''

''ఈ ఫోటో వెనుక 'ఐలవ్యూ' అని రాసి వున్న అక్షరాలు మీరు రాసినవా?'' అన్నాడు ఫోటో నాకు అందించి. అది నా చేతి వ్రాత కాదు.

''అబ్బే! ఇది నేను రాసింది కాదు'' అన్నాను.

''మరి ఈ ఫోటో అతని భార్య దగ్గరకు ఎలా వెళ్లింది''

''ఏమో, అంతా మిస్టరీగా ఉంది. సరే గాని కిష్టీ, ఇప్పుడు మనం ఏమిటి చేయడం'' అన్నాను ఆత్రంగా.

''అంటే?''

''ఈ గౌతమరావు కంటపడడం మన ఆరోగ్యానికంత మంచిది కాదేమో'' అన్నాను.

''ఓస్, అదా మీ సందేహం. గౌతమరావుకి నిజం చెప్పేద్దాం'' అన్నాడు తేలికగా.

''అంటే ఎలా?''

''ఏం లేదు కాగితం కలం తీసుకోండి లెటరు డిక్టేట్ చేస్తా''

నేను మంత్ర ముగ్ధుడిలా కాగితం కలం తీసుకున్నాను. కిష్టి మొదలుపెట్టాడు

'గౌతమరావుగారికి!

మీరు పంపిన పైకం, ఉత్తరం ఫోటో చేరాయి. మీరు మీ భార్యను శంకించనవసరం లేదు. ఆమె మహాసాధ్వి. ఆ ఫోటోలో వ్యక్తి ఆచూకి దొరికింది. అతను మరెవరో కాదు. సచ్ఛీలతా, సంఘంలో మంచి పలుకుబడి ఉన్న డిటెక్టివ్ రాజేశ్వర్‌రావు. అంటే నేనే. మీరు ఇక్కడికి వస్తే మీతో కలసి మీ ఇంటికి వచ్చి, మీ ఆవిడతో మాట్లాడి, ఈ ఫోటో మీ ఇంట్లోకి ఎలా వచ్చిందో తెలుసుకుందాం. ఈ విషయంలో మీ కన్నా నాకు ఆసక్తి హెచ్చుగా ఉంది. కనుక సాధ్యమైనంత త్వరలో కలుసుకొనగలరు. మీకు సంబంధించిన వరకూ సమస్య పరిష్కారం అయిపోయింది కనుక మిగిలిన ఫీజు కూడా వచ్చేటప్పుడు తీసుకొస్తారని ఆశిస్తూ....

రాజేశ్వరరావు.

అంటూ ముగించాడు కిష్టి. నేను ఉత్తరం రాయడం ముగించి

''కిష్టీ! ఇది ఇంత సింపుల్ అంటావా?''

''ఇంతే బాస్''

***

''నేను లోనికి రావచ్చునా?'' అని గుమ్మం దగ్గర నిల్చున్న యువకుడు మర్యాద ఒలక బోస్తూ అడిగాడు. నేను ''కమిన్, వెల్కమ్'' అని అతన్ని

ఆహ్వానించి, అతను నా ఎదురుగా కూచోగానే స్టైల్‌గా సిగరెట్ వెలిగించి ''చెప్పండి'' అన్నాను ఠీవీగా.

''నేను గౌతమరావుని'' అన్నాడాయన.

నాకు వెన్నెముకలోంచి చలి ప్రారంభం అయ్యింది. నిస్సహాయంగా కిష్టివైపు చూసాను. నా అవస్థను అర్థం చేసుకున్న కిష్టి ''బాస్! మీకెన్ని ఇంపార్టెంట్ ఎంగేజ్‌మెంట్స్ ఉన్నా, ఇప్పుడు మీరు మదనపల్లి బయల్దేరక తప్పదు. ఇందులో మనం కూడా ఇన్వాల్వ్ అయ్యాం కనుక నాకు చాలా ఆసక్తిగా ఉందీ కేసు'' అన్నాడు. నాకు కొంచెం అర్థమయింది.

''చంపేశావు కిష్టీ. చాలా ముఖ్యమైన పనులు పెట్టుకున్నానే ఇవ్వాళ. అయినా నీ మాట కాదనడం దేనికి, బయల్దేరుదాం పద'' అంటూ కుర్చీలోంచి లేచాను.

ఆఫీసుకు తాళం పెట్టి ముగ్గురం నా కారులో మదనపల్లి బయల్దేరాం. మేం మదనపల్లి చేరుకునేసరికి మధ్యాహ్నం పన్నెండుగంటలయ్యింది.

మేం కారు దిగగానే దీనవదనంతో ఉన్న గౌతమరావు భార్య మమ్మల్ని సాదరంగా ఇంట్లోకి ఆహ్వానించింది. మేం సోఫాలో సెటిలవ్వగానే కాఫీలిచ్చింది. ఇక పని ప్రారంభిద్దామనే సదుద్దేశంతో ''నీ పేరేమిటమ్మా?'' అని అడిగాను గౌతమరావు భార్యని.

''ప్రమీల'' అందామె నెమ్మదిగా. ఆ తర్వాత ఏమిటి అడగాలో అంతుపట్టలేదు.

''కిష్టీ! ఇంటరాగేషన్ మొదలుపెట్టు' అన్నాను దర్జాగా సిగరెట్టు వెలిగించి.

కిష్టి గౌతమరావుతో ''రావు గారూ! మీరు ఫొటో ఏ నవల్లో దొరికింది'' అని అడిగాడు.

''అనుమానం పెనుభూతం- నవల్లోనండీ''

''ఆ నవల ప్రస్తుతం మీ దగ్గరుందా?'' అడిగాడు కిష్టి.

''ఉంది సార్'' అని లేచి వెళ్లి ఓ రెండు వందల పేజీలున్న నవల పట్టుకొచ్చి నాకిచ్చాడు. నేను ఆ నవలని ప్రమీలకిస్తూ ''చూడమ్మా నువ్వు ఈ నవలని చదివావా?'' అని అడిగాను.

''లేదండీ'' అందామె.

''ఏం? ఎందుకు చదవలేదు'' అన్నాను.

''ఆ ఫొటో అన్నారే, అది కనబడిన నాటినుండి ఇంట్లో గొడవగా ఉందండి. మనసు మనసులో లేదు''

''చూడమ్మా ఈ నవల మీ ఇంట్లోకి ఎలా వచ్చిందో నీకు తెలుసా?'' అని అడిగాడు కిష్టి.

ప్రమీల ఆ నవలను అటూ ఇటూ తిప్పి చూసి ''ఆ... గుర్తుకొచ్చింది సార్. ఈ నవలను నేను ఇంటికి తెచ్చాను. నేను పది రోజుల క్రితం విశాఖపట్నం వెళ్లాను. అక్కడ ఓ సిటీ బస్సులో నాకు ఈ నవల దొరికింది. దీన్ని నా పెట్టె అడుగున పడేసాను. దీన్ని నాతో పాటు ఈ ఊరికి తెచ్చినట్టు కూడా మరచిపోయాను. కానీ నేను వారం రోజుల క్రిందటే పెట్టె ఖాళీచేసేసాను. అప్పుడు నాకు ఈ పుస్తకం కనబడలేదే'' అంది ఆశ్చర్యంగా ప్రమీల.

''ఎలా కనిపిస్తుంది. దాన్ని చదువుదామని నేనే తీసాను. అప్పుడే అందులోనుంచి ఈ ఫొటో బయటపడింది'' అన్నాడ గౌతమ రావు. కిష్టి ఆమె దగ్గర్నుంచి ఆ పుస్తకం తీసుకుని తెరచి చూచాడు. చూడడమే కాదు తాను చూసింది నాకూ చూపించాడు. దాని లోపల కోడిగుడ్డు ఆకారంలో 'కనకమహాలక్ష్మి లైబ్రరీ, సూర్యబాగ్, విశాఖపట్నం అనే రబ్బరు స్టాంపు వేసుంది. దాన్ని చూసి ''బోధపడింది కిష్టీ, దీన్నెవరో లైబ్రరీనుంచి చదువుదామని తెచ్చుకుని సిటీబస్సులో మరిచిపోయారు'' అన్నాను. గౌతమరావు నా చేతిలో పుస్తకాన్ని తీసుకుని రబ్బరుస్టాంపు చూసి ''నా అనుమానాలన్నీ తీరిపోయాయి'' అన్నాడు నా రెండు చేతులు పట్టుకుని.

మా సమక్షంలోనే ఇంత దారుణమైన నిందవేసినందుకు ప్రమీలను క్షమాపణలు కోరాడు. ప్రమీల మొహంలో దీనత్వం తొలగి కొత్త వెలుగొచ్చింది. ఆమె అందంగా నవ్వి మాకు కృతజ్ఞతలు తెలిపి తాగడానికి మరో రౌండు కాఫీలిచ్చింది. మేం తిరిగొచ్చి కారులో కూచున్నాం. గౌతమరావు పరుగు పరుగున వచ్చి ''మీ బాలన్సు ఫీజు'' అని నా చేతిలో మూడు వేల రూపాయలు పెట్టాడు. నేను అతనికి వెయ్యి రూపాయలు తిరిగి ఇచ్చేసి ''ఈ వెయ్యి పెట్టి మీ ఆవిడకి మంచి చీరకొను'' అన్నాను. అతను ముసి ముసి నవ్వుల్తో ఆ వెయ్యి రూపాయలు తీసుకుని మాకు వీడ్కోలు పలికేడు. మా కారు కదిలింది.

''మొత్తానికి మన మొట్ట మొదటి కేసు విజయవంతంగా ముగిసింది బాస్''

''నీ బొంద, గౌతమరావు సమస్య పరిష్కారం అయ్యింది కానీ నా సమస్య అలాగే ఉంది.''

''మీకున్న సమస్యేమిటి బాస్ ఇందులో. అందమైన ఆడవాళ్లంతా మీ ఫొటోలు తమ దగ్గరుంచుకుని 'ఐలవ్యూ' అనుకుంటూ ఉంటే మగవాడైన వాడెవడైనా మురిసిపోవాలి కానీ దాన్నో సమస్య చేయకూడదు'' అన్నాడు కిష్టీ.

''సమస్య అంటే ఆసక్తి లేక ఆతృత. నేనే మంటున్నానో నాకే సరిగా బోధపడడం లేదు. ఆ.... క్యూరియాసిటీ, నా ఫొటో ఆ అమ్మాయి దగ్గర కెలా వెళ్లింది. అసలా అమ్మాయి ఎవరు? ఆ పుస్తకంలో నా ఫొటోను పెట్టిన అమ్మాయిని పట్టుకోవడమే నా ముందరున్న సమస్య. ఈ సమస్య పరిష్కారానికి మనం ఏం చేయాలి'' అని అడిగాను. కిష్టి ఓ క్షణం సేపు ఆలోచించి '' ఇట్నుంచి ఇటే వైజాగ్ వెళ్లిపోదాం బాస్'' అన్నాడు.

''రైట్, నువ్వెలా చెబితే అలాగే'' అన్నాను. టాంకునిండా పెట్రోలు నింపి విశాఖపట్టణానికి బయల్దేరాం.

''కిష్టీ! విశాఖపట్టణానికీ నాకూ ఉన్న సంబంధం ఏమిటో నీకు తెలుసా'' అని అడిగాను.

''తెలుసు బాస్ అది మీ మామగారి ఊరు. అక్కడ మీ అత్తవారిల్లుంది'' అన్నాడు తెలివిగా.

''కరెక్ట్, కానీ మనం ఈ రాత్రి మా అత్తవారింట్లో బస చేయటం లేదు. కారణం ఊహించగలవా?'' అని మరో ప్రశ్న సంధించాను.

''ఊహించలేను బాస్'' అంటూ ఓటమిని అంగీకరించాడు.

''మా మామగారికి, ఆ మాటకొస్తే మా అత్తగారిక్కూడా నేను డిటెక్టివ్‌నవ్వడం ఇష్టంలేదు. ఇక మా మరదలుంది చూసావూ, దానికి నా డిటెక్షన్ కిట్టక పోగా పైగా చిన్నచూపు కూడా''

''డిటెక్షన్ అంటేనా లేక మీరంటేనా?''

''నేనంటేనే''

''ఎందుకలా అనుకుంటున్నారు బాస్''

''కారణం ఉంది. నేను డిటెక్టివ్‌గా ప్రాక్టీసు పెడదామని అనుకుంటున్నానని చెప్పగానే పకపకా నవ్వింది. అంతేకాకుండా 'డిటెక్షన్ నీలాటి వాళ్ల



క్కాదు బావా!, అది చాలా చురుకైన తెలివైన వాళ్లకోసం'' అనేసింది నాతో డైరెక్టుగా''

''మీరు ఊరుకున్నారా బాస్''

''ఎందుకూరుకుంటాను 'నా తెలివి తేటలకేం తక్కువని దమాయించాను. అలా దమాయించగానే చల్లబడిపోయింది. అయినా తన మాటే నెగ్గించుకోవాలని ''బావా! అసలు నేను పెళ్లే చేసుకోనని ఎందుకు అంటున్నానో తెలుసా. నేను ఓ అబ్బాయిని ప్రేమించాను. అతనితో నా పెళ్లి జరగడం అసంభవం. ఆ అబ్బాయి ఎవరో నువ్వు పరిశోధించి తెలుసుకుంటే నువ్వు డిటెక్టివ్ యుగంధర్ అంతటి వాడివని ఒప్పుకుంటాను' అని ఛాలెంజ్ విసిరింది.

''మీరు ఛాలెంజ్‌ని స్వీకరించి ఇన్వెస్టిగేషన్ను ప్రారంభించారా?''

''నీ మొహం. ప్రేమా లేదు ప్రియుడూ లేడు. అదంతా నన్ను ఆట పట్టించడంకోసం ఆడిన నాటకం'' అన్నాను.

''ఐసీ''అన్నాడు కిష్టి నా తెలివికి ఆశ్చర్యపోతూ.

''కాబట్టి నేనన్నా, నా వృత్తన్నా గౌరవంలేని వాళ్ల ఇంటికి నేనెందుకు వెళ్లాలి'' అన్నాను. కిష్టి కూడా నా అభిప్రాయంతో ఏకీభవించాడు. మా కారు విశాఖపట్టణం చేరేసరికి రాత్రి ఎనిమిది గంటలయ్యింది.

తొందరగా వచ్చేసాం బాస్. మన అదృష్టం బాగుంటే ఈ రాత్రికే మన పని అయిపోవచ్చు. కారుని సూర్యబాగ్ వైపు పోనీయండి. తిన్నగా పోవడమే'' అన్నాడు కిష్టి.

సూర్యబాగ్‌లో కనకమహాలక్ష్మి లైబ్రరీ కనుక్కోవడం ఏమంత కష్టం కాలేదు. మేం వెళ్లేసరికి లైబ్రరీ క్లర్కు మేగజైన్స్, బుక్సూ సర్ది లైబ్రరీ మూసేయబోతున్నాడు. కిష్టి అతనితో ''మాకో చిన్న సహాయం చేయాలి సార్. అనుమానం పెనుభూతం నవలను ఎవరు తీసుకెళ్లారో వారి చిరునామా కావాలి'' అన్నాడు.

క్లర్కు మమ్మల్ని ఎగాదిగా చూసి ఏదో అనబోతూ ఉండగా, కిష్టి అతని చేతిలో యాభైరూపాయలుపెట్టి ''మాపని అయిపోతే మరో వంద గుద్దుతాం'' అన్నాడు.

క్లర్కు ఆఫీసు రూములోకి వెళ్లి ఓ పావుగంట తర్వాత రెండు రిజిస్టర్లు పట్టుకు బయటకు వచ్చాడు. ''వ్రాసుకోండి ఆ పుస్తకాన్ని యమ్. భ్రమరాంబిక ఏప్రిల్ ఒకటవ తారీకున తీసుకెళ్లారు. ఇక చిరునామా వ్రాసుకోండి. ఇరవై డాష్ పదిహేను డాష్ ఆరు నెహ్రూ నగర్, ప్రకాశం కాలనీ, విశాఖపట్నం'' కిష్టి వివరాలు శ్రద్ధగా రాసుకున్నాడు. అతని చేతిలో వందరూపాయలనోటు పెట్టి ''బయల్దేరుదాం బాస్'' అన్నాడు.

ఇద్దరం వచ్చి కార్లో కూచున్నాం.

''ఈ భ్రమరాంబిక ఎవరు కిష్టి'' అన్నాను కారు స్టార్టు చేస్తూ.

''అవన్నీ తర్వాత. ముందు హోటలు కెళ్లి భోంచేద్దాం. చాలా ఆకలిగా ఉంది'' అన్నాడు కిష్టి. ఇద్దరం హోటలు కెళ్లి సుష్టుగా భోజనం చేసాం.

''ఇప్పుడేం చేద్దాం కిష్టి'' అన్నాను. దానికి వాడు ''తర్వాతి కోర్సాఫ్ యాక్షన్ మన ఆఫీసులో డిస్కస్ చేద్దాం బాస్. మనం విశాఖపట్టణం ఏ పనిమీద వచ్చామో ఆ పని అయిపోయిందిగా'' అన్నాడు కిష్టి.

''నిజమే అనుకో మనం మళ్లీ ఈ ఊరు రావల్సుంటుందేమో'' అన్నాను సందేహంగా.

''అది మనం డిస్కస్ చేసుకున్న తర్వాత తేలే విషయం. ప్రస్తుతం ఈ ఊళ్లో మనకి ఎలాటి పనీ లేదు. అందుకే ఈ రాత్రికే తిరుగు ప్రయాణమవుదాం'' అన్నాడు వాడు.

''యూ ఆర్ రైట్'' అని కారు స్టార్ట్ చేసాను. మా తిరుగు ప్రయాణం ప్రారంభమైంది.

''కిష్టీ! ఏమైనా కబుర్లు చెప్పు'' అన్నాను స్పీడు పెంచుతూ.

''అయితే మిమ్మల్ని ఆటపట్టించేటంతటి మరదలుందా బాస్, మీకు''

''ఏం చిన్నపిల్లనుకుంటున్నావా? నా పెళ్లినాటికే ఎమ్మే పూర్తి చేసింది''

''అబ్బా!... మీ మరదలు పేరేమిటి బాస్''

**''ఏమిటి బాస్ మీరు. డిటెక్టివ్ అయ్యుండి కూడా, మరదలి పేరు తెలియదు, అత్తవారింటి అడ్రస్ తెలియదు అంటారు. ఇవన్నీ మాటల సందర్భంలో వస్తాయో. మీ శ్రీమతి మిమ్మల్ని చాలా సార్లు కవర్లమీద ఎడ్రస్సులు రాయమనుంటుందే. అన్నీ మరచిపోతే ఎలా బాస్''**

''అంబ''

''అంబేమిటి బాస్. అది పిలుచుకునే పేరు. అసలు పూర్తి పేరేమిటి.''

''మతలబుల అంబ'' అని మళ్లీ తిరిగి నేనే ''అసలు పేరే అంబ. పూర్తి పేరు మతలబుల అంబ'' అన్నాను.

''ఓ! మతలబుల వారా? ఇంతకీ విశాఖపట్నంలో మీమామగారిల్లెక్కడ'' అడిగాడు కిష్టి.

''ఏమో, ఆ వీధుల పేర్లు నాకు తెలియవు. నేను ఎప్పుడు వాళ్లింటికెళ్లినా మా ఆవిడతోనే వెళతాను. ఆవిడే నన్ను సురక్షితంగా వాళ్లింటికి చేరుస్తుంది''

''ఏమిటి బాస్ మీరు. డిటెక్టివ్ అయ్యుండి కూడా, మరదలి పేరు తెలియదు, అత్తవారింటి అడ్రస్ తెలియదు అంటారు. ఇవన్నీ మాటల సందర్భంలో వస్తాయో. మీ శ్రీమతి మిమ్మల్ని చాలా సార్లు కవర్లమీద ఎడ్రస్సులు రాయమనుంటుందే. అన్నీ మరచిపోతే ఎలా బాస్''

''నువ్వు చెప్పింది నిజమే కానీ, ఇది షార్ప్‌నెస్ తగ్గడం వల్ల కాదు. ఇంట్రస్టు లేకపోవడం వల్ల. మా మామగారి వీధిపేరు చెప్పేస్తాను చూడు. అలాటి పేరున్న వీధులు అన్ని ఊళ్లలోనూ వుంటాయి''

''యమ్ జీ రోడ్డా?''

''కాదు... కాదు... అలాంటిదే... నెహ్రూనగర్''

''ఓహో, మనం కనిపెట్టవలసిన భ్రమరాంబికదీ నెహ్రూనగరే. మనం కానీ ఈ రాత్రి మీ మామగారింట్లో బసచేసి ఉంటే తెల్లారేసరికల్లా ఆ భ్రమరాంబికను కనిపెట్టేసి ఉండే వాళ్లమేమో''

''నా ప్రాణం పోయినా వాళ్లింట్లో బసచేయను'' అన్నాను కోపంగా.

''మరదలి మీద కోపమేమిటి బాస్, మరదళ్లు హాస్యాలాడరా? ఏం మీ మరదలు అందంగా ఉండదా?''

''ఎంత మాటన్నావ్, మెరుపుతీగ'' అన్నాను మరదలి అందాన్ని తలుచుకుని పరవశించిపోతూ.

''అందుకేనా, మీకు కనీసం ఆవిడ పూర్తి పేరు కూడా తెలియదు.

''తెలియదా, నాన్‌సెన్స్, అదే దాని పేరు. వాళ్ల నాన్న దాన్ని అంబా అని పిలుస్తాడు. వాళ్లమ్మ అలానే పిలుస్తుంది. నా భార్య అలానే పిలుస్తుంది. మా బామ్మర్ది ఒకడున్నాడు. వాడు మాత్రం మా భ్రమరా మా భ్రమరా అంటాడు.''

''ఏమిటీ వాళ్లన్నయ్య భ్రమరా అంటాడా? వాళ్ల నాన్న అంబా అంటాడా''

''యస్, దానిలో అంత ఆశ్చర్యపోవలసినది ఏముంది?''

''అంటే, ఆ పిల్లపేరు భ్రమరాంబ అయ్యుండొచ్చు'' అన్నాడు కిష్టి.

నేను సడన్ బ్రేకు వేసాను. క్రీచుమని శబ్దం చేస్తూ కారు ఆగింది.

''యూ ఆర్ రైట్, భ్రమరాంబిక అయ్యుండొచ్చు'' అన్నాను చురుగ్గా.

ఫైగా యమ్.భ్రరాంబిక, యమ్ అంటే మతలబుల. కేసు మంచు విడిపోతున్నట్టు విడిపోతోంది బాస్. ఫొటో వెనకాల అక్షరాలు ఆమె చేతివ్రాతేనా?'' అన్నాడు కిష్టి.

''ఏమో మా మరదలి చేతివ్రాత నేను గుర్తుపట్టలేను'' అన్నాను నిస్సహాయంగా.

''ఫర్వాలేదు. మీరు కాకపోతే మీ శ్రీమతి గుర్తుపడతారు. అది తర్వాత తేలుతుంది. కానీ పాజిబులిటీస్ అన్నీ చూస్తే అలా రాసింది మీ మరదలే అనిపిస్తోంది. ఫొటో వెనక ఐలవ్యూ అని రాసింది. అంతకు ముందే నేను ప్రేమలో పడ్డాను బావా అని చెప్పింది. నా ప్రియుణ్ణి పెళ్లాడడం ఇంపాజిబుల్ అంది. కారణం ప్రియుడికి పెళ్లి అయిపోయింది. నువ్వే సిసలైన డిటెక్టివ్‌వి అయితే నా హృదయంలో ఉన్నది నీవేనని తెలుసుకో అని రొమాంటిగ్గా మీకో ఛాలెంజ్ విసిరింది. మీరేమో, ఆమె ఎగతాళి చేస్తోందనుకున్నారు. ఎంతఘోరం బాస్. మీ గుండెలో ప్రేమ ఎండిపోయిందా? మీ హృదయంలో రొమాన్సే లేదా?'' అన్నాడు కిష్టి ఉద్వేగంగా.

''కిష్టీ! ఆపరా బాబూ నాకు మతిపోతోంది, నేనిక డ్రయివ్ చేయలేను. నువ్వు స్టీరింగు ముందు కూచో. ముందు నన్ను కాస్త స్థిమిత పడనీ'' అన్నాను. కారు కదిలింది. నాకు చాలా హాయిగా, ఉత్సాహంగా ఉల్లాసంగా హుషారుగా ఉంది.

''అయితే కిష్టీ! మా మరదలు నన్ను ప్రేమిస్తోందంటావా?''

''పరిస్థితులన్నీ ప్రేమిస్తోందనే చెబుతున్నాయి బాస్. కానీ ఫొటో వెనుక అక్షరాలు ఆమె రాసినవే అని తేలాలిగా''

"కిష్టీ! ఈ ఫొటోని మా ఆవిడకి చూపి వెనుక నున్న ఐలవ్యూ వ్రాసింది నీ చెల్లెలేనా అని అడిగితే, ఒకవేళ అది ఆమె చెల్లెలి చేతివ్రాతే అయితే అప్పుడు తన చెల్లెలు తన భర్తను ప్రేమిస్తున్నదని తెలుసుకుని నా భార్య బాధపడదూ'' అన్నాను సందేహంగా.

"తప్పకుండా బాధపడుతారు బాస్. ఆమె బాధ పడకుండా ఉండడానికో మార్గముంది. ఈ ఫొటో పట్టే సైజులో ఓ వైటు కవరు తేండి. ఆ కవరులో ఈ ఫొటో పెట్టి, ఫొటో వెనుకభాగం వచ్చేవైపు కవరును ఓ పేకముక్కంత మేర కత్తిరించండి. ఆ కత్తిరించిన భాగంలో ఉన్న అక్షరాలు మాత్రమే కనిపిస్తాయి. దాన్ని చూపి ' ఈ దస్తూరి ఎవరిది' అని అడగండి' తేలిపోతుంది. అవి ఫొటో వెనుక రాసిన వాక్యాలని కూడా ఆమె కనిపెట్టలేదె.''

"కిష్టీ! యూ ఆరెజీనియస్''

"థాంక్యూ బాస్'' అన్నాడు కిష్టి. మా కారు ఊరు చేరేసరికి నాలుగైంది. ఇల్లు చేరగానే మంచ మెక్కి ఆదమరచి నిద్రపోయాను.

***

తీరా పని ప్రారంభించే సమయం వచ్చేసరికి నాలో భయం మొదలయ్యింది.

కొంపతీసి నా భార్య మూర్ఖంగా ఆ కవరును చించి అందులో ఉన్న నా ఫొటోనూ దాని వెనుక వున్న తన చెల్లెలి చేతి రాతను చూసేస్తే. బాగా ఆలో చించాను. కవరును నా భార్య చేతికి ఎట్టి పరిస్థితిలోనూ ఇవ్వ కూడదని నిశ్చయించుకున్నాను.

కవరును నా చేతితో గట్టిగా పట్టుకుని అక్షరాలు మాత్రమే కని పించేట్టు అమర్చుకుని మంచం మీద పడుకుని మేగజైన్ చదువు కుంటున్న భార్యామణి దగ్గరకు వెళ్లి " ఈ అక్షరాలెవరివో గుర్తించ గలవా?'' అన్నాను. ఆవిడ కనీసం లేచి కూచోకుండా, అధమం చేతిలో ఉన్న పత్రికనైనా మూయకుండా యథాలాపంగా చూసి "మా చెల్లి అంబ రాసింది'' అనేసి మళ్లీ పత్రిక చదవడంలో మునిగిపోయింది. నా ఆనందం అవధులు దాటేస్తోంది. నిన్నలేని అందమేదో నిదురలేచినట్టు అని పిస్తోంది. "అదేమిటీ, అంత నిర్ల క్ష్యంగా తీర్పు చెప్పేసావ్. సరిగ్గా చూడకుండానే. అదీ ఓ గొప్ప హ్యాండ్ రైటింగ్ ఎక్స్‌పర్ట్‌లాగా. ఈ అక్షరాలు మీ చెల్లెలు రాసి నవా, లేక ఈ రాత మీ చెల్లెలి చేతి రాతను పోలివుందా?'' అని అడి గాను.

"పోలి ఉండడం ఏమిటీ, అక్షరాలాలా అవి మా చెల్లెలు రాసిన అక్షరాలే.''

"అంత కచ్చితంగా ఎలా చెప్పగలుగుతు న్నావు?''

" ఎలా అంటే అవి రాస్తున్నప్పుడు నేను దాని పక్కనే ఉన్నాను కాబట్టి''

"అన్నీ తెలిసినట్టు మాట్లాడేస్తున్నావే'' అన్నాను ఎగతాళిగా. ఆవిడ పుస్తకం మూసి చిరాగ్గా నావైపు చూసి- "అన్నీ తెలుసును కాబట్టే మాట్లాడుతు న్నాను. ఐలవ్యూ అనే వాక్యాలు మా చెల్లెలు మీ ఫొటో వెనుక భాగంలో రాసింది. మన పెళ్లికి ముందు మీ ఫొటో అంటే పెళ్లికొడుకు ఫొటో మా వాళ్లందరూ చూస్తామంటున్నారు ఓ ఫొటో కాపీ పంపండి అని మా వాళ్లు రాస్తే మీ వాళ్లు ఈ ఫొటోను పంపించారు. అందరు బంధువులు చూడడం అయ్యాక దాని వెనుక ఐలవ్యూ అని రాసి మీకు పంపించమని మా చెల్లెలు ప్రాణాలు తోడే సింది. 'పంపించవే అక్కా బావగారు మురిసిపోయి జీవితాంతం పదిలంగా దాచుకుంటారు' అంటూ విసిగించింది. అలా పంపే ధైర్యం లేక 'నా దస్తూరి బాగుండదు. మీ బావ నా రైటింగుకు నవ్వుకుని నన్ను ఆటపట్టించే ప్రమాదం లేక పోలేదు'' అన్నాన్నేను.

"అదే నీ ప్రాబ్లం అయితే ముత్యాల్లాంటి అక్షరాలతో నేను రాస్తాను. ఫొటో నువ్వు పంపించు'' అని నా ఎదురుగా కూచుని ఫొటో వెనుక భాగ మంతా ఐలవ్యూ అని రాసేసింది. నేను అలాగేలే అని ధైర్యం చాలక మీకు పంపించలేదు. మీ దగ్గర కెలా వచ్చిందో కానీ చాలా కాలం ఆ ఫొటో మా ఇంట్లో టేబులు మీద పడేసి ఉండేది. నవలలు చదివే పిచ్చి ఉన్న మా చెల్లెలు తను చదువుతున్న నవలను ఎన్ని పేజీల వరకు చదివిందో గుర్తు పెట్టుకునే బుక్‌మార్కులా చాలా కాలం ఉపయోగించింది. ఈ వివ రాలు చాలా-'' అనేసి రుసరుస లాడుతూ గోడవైపు తిరిగి పడు కుంది మా ఆవిడ. ★



## సెల్ఫ్ మార్కెటింగ్

**సూ**ర్యంలో నటించిన తరు వాత తనకు సౌత్‌లో కుప్పలు తెప్పలుగా అవకాశాలొస్తున్నా యని సెలీనా జెట్లీ కోతలు కోస్తూ వుంది. సూర్యంలోని తన స్టెప్పులకు జనం వెర్రిగా ఈలలు వేస్తున్నారని, ఆటోడ్రైవ ర్లంతా తన ఫ్యాన్స్ అయిపోయా రని చెబుతోంది. అయితే సెలీ నాను దక్షిణాది నిర్మాతలెవరూ పట్టించుకున్నట్టు కనబడ్డం లేదు. ఆమె ముంబై నుంచి తట్టాబుట్టా సర్దుకుని సౌత్‌కి వచ్చే పరిస్థితులేమీ లేవు. హిందీ లోనే సెలీనాకున్న అవకాశాలు అంతంతమాత్రం. ఇలా చెప్పుకో వడాన్ని సెల్ఫ్ మార్కెటింగ్ అంటారు.